నిమజ్జనానికి వేళాయే..

• 17 చెరువుల్లో గణనాథుల నిమజ్జనానికి సర్వం సన్నద్ధం • ప్రతి చెరువు వద్ద రెండు క్రేన్లు, గజ ఈతగాళ్లు, వైద్య శిబిరం
• నోడల్ అధికారి పర్యవేక్షణలో 10 మంది సిబ్బంది • 2000 మంది పోలీసులతో భారీ బందో బస్తు
• 32 వేల విగ్రహాలను ప్రతిష్ఠించిన మండపాల నిర్వాహకులు • ఇప్పటి వరకు 16 వేలకు పైగా నిమజ్జనం





సాక్షి, సిటీబ్యూరో: నవరాత్రుల పూజలందుకున్న గణనాథుడు మంగళవారం నిమజ్జనానికి తరలే సమయం ఆసన్నమైంది. శోభాయాత్ర మొదలు చెరువుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే వరకు నిర్వాహకులు సమష్టిగా ముందుకు సాగాల్సి ఉంటోంది. నిమజ్జనం వేళ ఆపద కొనితెచ్చుకోకుండా... మండప సంఘాలు జాగ్రత్తలు తీసుకుంటూ వినాయకుడికి ఆదర్శంగా వీడ్కోలు పలకాలని అధికార యంత్రాంగం విజ్ఞప్తిచేస్తోంది. ఎలాంటి అపశ్రుతులు జరగకుండా పోలీస్, పురపాలక, రెవెన్యూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళికలను సిద్ధం చేశారు. నిమజ్జనానికి 17 చెరువులను గుర్తించి ఏర్పాట్లు పూర్తి చేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 32 వేలకు పైగా వినాయక విగ్రహాలను నిర్వాహకులు ఏర్పాటు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఇప్పటి వరకు 16 వేలకు పైగా విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు పేర్కొంటున్నాయి. నిమజ్జన సమయంలో నిర్వాహకులు, భక్తులు జాగ్రత్తలు తీసుకోవాల్సింటోంది.

◆ 17 చెరువుల వద్ద గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 2 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి చెరువు వద్ద రెండు క్రేన్లు ఏర్పాటు చేయటంతోపాటు ఇద్దరు గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచారు. చెరువుల వద్ద విద్యుత్ లైటింగ్, మంచినీటి వసతితోసహా 10 మంది సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పోలీసు పికెట్, మెడికల్ క్యాంపు,ఫైర్ ఇంజన్, విద్యుత్ సౌకర్యాలను కల్పించారు.

◆ భక్తులకు టాయ్‌లెట్లు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో ఎలాంటి విద్యుత్ అంతరాయానికి ఆస్కారం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

◆ వినాయక నిమజ్జనలో ఎలాంటి అపశ్రుతులు చోటుచేసుకోకుండా 17 చెరువుల వద్ద ప్రత్యేక అధికారులుగా మున్సిపల్ కమిషనర్లు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లను జిల్లా కలెక్టర్ నియమించారు.

నిమజ్జనంలో పాటించాల్సిన జాగ్రత్తలివే...

◆ చిన్న వినాయకులను నిర్వాహకులు మోసుకెళ్తే మేలు. బరువు ఎక్కువగా ఉన్న వాటిని భారీ క్రేన్ సాయంతో వాహనంపై ఎక్కించాలి. యువజన సంఘాల సభ్యులు ఉన్నారు కదా అని గణనాథుడిని వాహనానికి మోసుకెళ్లే సమయంలో ఊహించని ఘటన జరిగితే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. శోభాయాత్రలో బాహనంపై చిన్న పిల్లలుంటే వారిని జాగ్రత్తగా చూసుకోవాల్సింటోంది.

నిర్దేశించిన మార్గాల్లోనే...

◆ ప్రతి గణేశ్ మండపానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వరుస సంఖ్య కేటాయిస్తారు. నిర్వాహకులు భారీ విగ్రహాలతో మధ్యలో చేరితే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. పోలీసులు సూచించిన రూట్ మ్యాప్ అనుసరించి, నిర్దేశించిన మార్గాల్లోనే ముందుకు కదలాల్సి ఉంది. కొందరు మండపాల నిర్వాహకులు, యువత మద్యం తాగి నృత్యాలు చేస్తూ.. యాత్రలో ముందుకు కదులుతుంటారు. ఇది ఏమాత్రం సరికాదు.

డీజే శబ్దాలకు దూరంగా...

◆ శోభాయాత్రలో భారీ తరహా డీజే శబ్దాలు పెడుతూ యాత్రలో ఇబ్బందులు కలిగిస్తే ఉత్సవాలు గాడితప్పే వీలుంది. 12 అడుగుల డీజే పరికరం 75 డెసిబుల్స్ మించి శబ్దం వినిపిస్తే పోలీస్ శాఖ కేసులు పెట్టే అవకాశం ఉంటోంది. నిమజ్జనం పూర్తిచేసిన తర్వాత ఆ మండపానికి సంబంధించిన నిర్వాహకులంతా ఒక చోట చేరి, నిమజ్జన యాత్రకు వచ్చిన వారందరూ ఉన్నారా లేదా లెక్క చూసుకోవాలి.

◆ మద్యం, విందు, చిందులకు తావివ్వకుండా.. అక్కడి నుంచి క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని పెద్దలు, పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. విద్యుత్ తీగలను సరిచేయడానికి సంబంధిత అధికారుల సాయం తీసుకోవాలి. ఎక్కువ మంది చెరువుల లోపలికి వెళితే గందరగోళానికి గురయ్యే అవకాశం ఉంది. చిన్నారులు నీళ్లల్లో జారిపడే ప్రమాదం ఉంది. క్రేన్ ఎక్కి చెరువులోనికి వెళ్లే ప్రయత్నం చేయకూడదు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవం

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మంగళవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాయం ఆవరణలో ఉదయం 10 గంటలకు గంటలకు ఎమ్మెల్సీ డాక్టర్. పట్నం మహేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఎగువేస్తారు. అనంతరం పోలీసులచే గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్, జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారు.

గణేష్ నిమజ్జనానికి ప్రత్యేక అధికారులు వీరే...

సాక్షి, సిటీబ్యూరో: వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకొని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 17 చెరువులలో ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమం జరిగేలా జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రత్యేక అధికారులను నియమించారు.

చెరువుల వారీగా నియమితులైన ప్రత్యేక అధికారుల వివరాలివీ...

- మేడ్చల్ సుతారి చెరువు, మేడ్చల్ వసంతలక్ష్మి (ఎంపీడీఓ), ఫోన్: 98499 03330
- మేడ్చల్ పెద్ద చెరువు, నాగిరెడ్డి (మున్సిపల్ కమిషనర్), ఫోన్: 70328 98999
- బాచుపల్లి ప్రగతి నగర్ ట్యాంక్, సౌజన్య (ఎంసీ నిజాంపేట్), ఫోన్: 77290 03999
- ఉప్పల్ నల్ల చెరువు, ఆంజనేయులు (డిప్యూటీ కమిషనర్), ఫోన్: 80081 03667
- కుత్బుల్లాపూర్ వెన్నెలగడ్డ చెరువు, నర్సింహ (కమిషనర్), ఫోన్: 99899 30159
- కుత్బుల్లాపూర్ పరికి చెరువు, ఎల్.పి.మల్లయ్యకు (డిప్యూటీ కమిషనర్, గాజులరామారం), ఫోన్: 63095 29286
- కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్, శ్యామ్ ప్రకాష్ (ఆర్‌డీఓ), మల్కాజ్గిరి డివిజన్ ఫోన్: 79950 73753
- బాలానగర్ హస్మత్‌పేట్ బోవెన్ చెరువు, కృష్ణయ్య (డిప్యూటీ కమిషనర్), ఫోన్: 73375 57245
- కూకట్‌పల్లి సున్నం చెరువు, స్వామి (తహసీల్దార్), ఫోన్: 79950 73755
- శామీర్‌పేట సరస్సు, మమతాబాయి (ఎంపీడీఓ), ఫోన్: 9849903332
- సఫిల్‌గూడ ట్యాంక్, రాజు (మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్), ఫోన్: 73311 89762, 91548 99636
- అల్వాల్ కొత్త చెరువు, శ్రీనివాస్ రెడ్డి (డిప్యూటీ కమిషనర్), ఫోన్: 89854 09173
- సూరారం చెరువు (లింగం), రెహమాన్‌ఖాన్ (తహసీల్దార్ కుత్బుల్లాపూర్), ఫోన్: 79950 73757
- ఎదులాబాద్ ట్యాంక్, షబీర్ అలీ (ఘట్‌కేసర్ ఎంసీ), ఫోన్: 91540 83769, 91548 12771
- కాప్రా చెరువు, ముకుంద్ రెడ్డి (డిప్యూటీ కమిషనర్), ఫోన్: 90001 13021
- రాంపల్లి చెరువు, రాజేంద్ర కుమార్ (నాగారం ఎంసీ), ఫోన్: 7075596119
- చెర్లపల్లి చెరువు, సుచరిత (తహసీల్దార్ కాప్రా), ఫోన్: 79950 73748.



రూ. 2 లక్షలు పలికిన గణేష్ లడ్డూ



లడ్డూను దక్కించుకున్న మున్సిపల్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు సోమేశ్

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని పీఎస్‌రావ్ నగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద లడ్డూ వేలం పాట సందడిగా సాగింది. మున్సిపల్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు సోమేశ్ రూ. 2 లక్షలకు వేలం పాటలో స్వామివారి లడ్డూను దక్కించుకున్నారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో నెలకొలిపిన గణనాథులను మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్, కౌకుట్ల చంద్రారెడ్డి దర్శించుకొని అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించారు. కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



మేడ్చల్ పెద్ద మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మేడ్చల్: మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ముస్లింలు నిర్వహించే మిలాద్ ఉన్ నబీ పండగను మేడ్చల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. మసీదులను శుభ్రం చేసి అందంగా అలంకరించి మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనలతో పాటు జష్నే మిలాద్, నాథ్, జల్సా కార్యక్రమాలను నిర్వహించారు. మేడ్చల్ పెద్ద మసీదు, అత్వెల్లి మసీదుల్లో పెద్ద ఎత్తున ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఎదులాబాద్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పర్యటన



ఎదులాబాద్‌లో పర్యటిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో వాటర్ పైప్‌లైన్, డ్రైనేజీని నిర్మించాలని స్థానికులు కోరారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. అత్యవసర సమస్యలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో విశ్వనాథం, రవి, యుగేందర్‌గౌడ్, నరసింహ, భాస్కరయ్య, సురేశ్ తదతరులు పాల్గొన్నారు.

సందడిగా ఊరేగింపులు.. నిమజ్జనాలు



మేడ్చల్ పెద్ద చెరువులో నిమజ్జనం అవుతున్న వినాయకుడు

మేడ్చల్: వినాయక నవరాత్రులు ముగుస్తుండటంతో వినాయక పూజలు, ఊరేగింపులు,పూజలు.. అన్నదానాలు.. నిమజ్జనాలు జోరుగా సాగుతున్నాయి. మేడ్చల్ పెద్ద చెరువులో ఆదివారం రాత్రి, సోమవారం వినాయక విగ్రహాలను అధికంగా నిమజ్జనాలు చేశారు. మండపాల నుంచి కాలనీలలో వినాయకుడిని ఘనంగా ఊరేగించి చెరువులలో నిమజ్జనం చేశారు. సోమవారం పలు కాలనీలలో మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద చెరువు వద్ద పోలీసులు ఇతర శాఖ ల అధికారులు నిమజ్జనం కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.లడ్డుల వేలం లక్షల్లో సాగింది. సంతోషిమాత గుడి సమీపంలో పట్టణ గణేష్ త్సువ సమితి నాయకులు నిమజ్జనం కు వెళ్ళి వినాయకులకు స్వాగతం పలికి నిర్వాహకులను ఘనంగా సన్మానించారు.



ఆర్‌టీసీ కాలనీలో నిమజ్జనానికి తరలుతున్న గణేషుడు



నిర్వాహకులకు సన్మానిస్తున్న ఉత్సవ సమితి నాయకులు

'ఎమ్మార్‌సెట్'లో సీనియర్స్‌కు సందడిగా వీడ్కోలు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: మైసమ్మగూడలోని ఎమ్మార్‌సెట్ ఎంబీఏ కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. చివరి సంవత్సరం విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు పలుకుతూ నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వీఎస్‌కే రెడ్డి పాల్గొని మాట్లాడుతూ... ఎంబీఏ విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని విద్యభాస్యం పూర్తి చేసుకుని బయట ప్రపంచంలోకి అడుగుపెడుడుతున్న విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, డీన్ వేణుగోపాల్, ఏఓ రాజేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఓడీ నవీన్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

బోడుప్పల్: విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్ అడ్మిన్ డైరెక్టర్ రూపేష్ అన్నారు. బోడుప్పల్ కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన ఇంటర్ స్కూల్ స్కేటింగ్ పోటీల్లో భాగంగా 'గ్లైడ్ టు గ్లోరి' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా వారిస్థాయి, వయస్సును అనుసరించి రోలర్ బ్లేడ్ స్కేటింగ్, క్వాడ్ స్కేటింగ్ తదితర విభాగాల్లో యు 7–9, యు 9–11, యు 11–14 మధ్య పోటీలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చినట్లు వివరించారు. గెలుపొందిన వారితో పాటు ప్రతి విద్యార్థికి క్రీడల్లో స్ఫూర్తి కలిగించేలా బహుమతులను అందజేసినట్లు ఆయన తెలిపారు.

కుక్కల నుంచి రక్షించుకునేందుకు చర్యలు

వరల్డ్ రాబిస్ డే సందర్భంగా వ్యాక్సినేషన్

బోడుప్పల్: ప్రజలు వీధి కుక్కల భారిన పడకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. బోడుప్పల్‌నగర పాలక సంస్థ, బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ ఎన్‌జీఓ, కొల్లాబ్రేషన్ విత్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్స్ మిషన్ రాబిస్ అండ్ వెటర్నరీ సర్వీసెస్ సంయుక్తాధ్వర్యంలో సోమవారం బోడుప్పల్‌లో వరల్డ్ రాబిస్‌డేను నిర్వహించారు. కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు ప్రమాదవశాత్తు కరిచిన రాబిస్ సోకకుండా ఉండేందుకు రాబిస్ వ్యాక్సినేషన్ వేస్తున్నట్లు వివరించారు. బోడుప్పల్‌లో వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు కలిపి మొత్తం 325 కుక్కలకు రాబిస్ వ్యాక్సినేషన్ వేశామన్నారు. బ్లూ క్లాస్ ఆఫ్ హైదరాబాద్ పీఎఫ్‌ఓ కుమారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



రాంపల్లి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

కీసర: గణేష్ నిమజ్జనం జరిగే చెరువుల వద్ద గణనాథుల నిమజ్జనం ప్రశాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామనని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధికాగుప్తా అన్నారు. సోమవారం గణేష్ నిమజ్జనం నేపథ్యంలో రాంపల్లి చెరువు వద్ద ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా మాట్లాడతూ... నిమజ్జనం కోసం చెరువు వద్దకు తీసుకువచ్చే గణనాథులను చెరువుల్లో నిమజ్జనం చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్‌కు సూచించారు. పోలీసు, మున్సిపల్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది నిమజ్జనం పూర్తయ్యేవరకు చెరువు వద్దనే అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. చెరువులోంచి ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయక్‌సాగర్ వద్ద...

ఘట్‌కేసర్: ఎదులాబాద్ వినాయక్‌సాగర్ శ్రీ లక్ష్మీనారాయణ చెరువును అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సందర్శించారు. మంగళవారం జరుగనున్న నిమజ్జం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై పోలీస్, మున్సిపల్, రెవెన్యూ శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిమజ్జనం ప్రశాతంగా, అపశ్రుతులు లేకుండా జరగడానికి సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు.

ఒంటెపై ఊరేగిన గణనాథుడు

మేడ్చల్: తొమ్మిది రోజులు పూజలు అందుకున్న గణనాథుడి నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు రకరకాల వాహనాల్లో అందంగా అలంకరించి డీజేలు, బ్యాండు మేళాలతో ఊరేగించి చెరువులలో నిమజ్జనం చేయడం చూస్తుంటాం. మేడ్చల్ పాత గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని నిర్వాహకులు ఒంటెపై ఊరేగించారు. సన్నాయి మేళాలతో, కోలాటంతో ఆడి పాడి భజనలతో ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు.



మేడ్చల్ వీధుల్లో ఒంటె పై గణనాథుడు

గురుకుల అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు ఆహ్వానం

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల ఇబ్రహీం మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పొలిటికల్ సైన్స్–1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్–1, జాగ్రఫీ–1 అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జక్టులలో పీజీలో 55 శాతం కలిగిన మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఔత్సాహిక అభ్యర్థులు ఈ నెల 18న ఉదయం 10 గంటలకు డెమో, ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. నెట్, సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అదనపు సమాచారం కోసం ఫోన్: 99484 86101లో సంప్రదించాలన్నారు.

శ్రమదానంతో గుంతల పూడ్చివేత



గుంతలు పూడ్చుతున్న డ్రైవర్లు

మేడ్చల్: మేడ్చల్ నుంచి గౌడవెల్లి వెళ్లే రోడ్డు గుంతలమయం కావడం, అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా కనీస మరమ్మతులు చేయక పోవడంతో ఆ రూట్లో నిత్యం తిరిగే రవాణా వాహనాల డ్రైవర్లు నడుం బిగించి పార పలుగు చేత బట్టి రోడ్డు పక్కన ఉన్న మట్టిని తవ్వి రోడ్డుపై ఉన్న గుంతలను మట్టితో పూడ్చి చదును చేశారు. ఆటో డ్రైవర్లు, గౌడవెల్లికి చెందిన ట్రాన్స్‌పోర్ట్ యజమాని వీరేష్ అందరూ కలిసి శ్రమ దానం చేసి రోడ్డుపై గుంతలను పూడ్చి సమస్యను తాత్కాలికంగా తీర్చారు.

పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి



కీసరలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న పటోళ్ల విక్రంరెడ్డి తదితరులు

కీసర: దేశంలోని పేద ప్రజలకు మేలు చేసేందుకు విద్యా, వైద్యం, రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని మేడ్చల్ జిల్లా బీజేపీ రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి అన్నారు. సోమవారం కీసర చౌరస్తాలో బీజేపీ బూత్ స్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని నరేంద్రమోదీ నాయకత్వంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున వివిధ పార్టీలకు చెందిన నేతలు, నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారు. బీజేపీ కీసర మండల అధ్యక్షుడు దేశం మల్లేష్‌గౌడ్, కీసర మండల సభ్యత్వ నమోదు కన్వీనర్ కొలిచెలిమి కృష్ణ, నేతలు శ్యాంసుందర్ శర్మ, జల్లాల తిరుమల్‌రెడ్డి, సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, చిందం నాగేష్, వంగేటి బాపిరెడ్డి, మెట్టు కృష్ణయాదవ్, అశోక్‌ముదిరాజ్, బండారి శ్రీనివాస్‌రెడ్డి, మెట్టు మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రిమీలేయర్ విధానాన్ని అమలు చేయాలని పాదయాత్ర



పాదయాత్రలో దళిత వికాస సమితి నేతలు

మేడ్చల్‌రూరల్: ఎస్సీ రిజర్వేజన్‌లో క్రిమీలేయర్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దళిత వికాస సమితి ఆధ్వర్యంలో చేపట్టిన సమన్యాయ పాదయాత్ర సోమవారం మేడ్చల్ మండలానికి చేరుకుంది. దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షులు కిన్నెర సిద్దార్థ బృందం ఈ నెల 1న ఆదిలాబాద్‌లో ప్రారంభమైన యాత్ర మేడ్చల్‌కు చేరడంతోమండలంలోని ఎల్లంపేట్ గ్రామంలో మాజీ సర్పంచ్ తుడుం లింగం యాత్ర బృందానికి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత 70ఏళ్లుగా అమలవుతున్న ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు పొంది 3 శాతం మంది దళితులు సంపన్నులుగా మారారాని క్రిమీలేయర్ విధానం అమలుతో అందరికీ ఫలాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆదికేశవులు, నాయకులు నాగేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.